# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 349 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శనివారం 15 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి

## జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ముర్ము

**హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే ఉదయం)**

భారత రాజ్యాంగాన్ని మనం గౌరవించాలని, వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశమిచ్చారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఆమె ఆకాంక్షించారు. అంతేకాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను మనం గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. తెల్లారితే ఎనభయో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో యావత్ భారతావని పులకించనుంది. ఈ చరిత్రాత్మక రోజును పునస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించిన ఆమె న్యాయ వ్యవస్థను, చట్టసభలను మనం గౌరవించాలని ప్రజలకు సందేశమిచ్చారు. తాజాగా లోక్ సభ లో మొట్ట మొదటిసారిగా ఆలపించిన వందేమాతరం గీతాన్ని పౌరులంతా గౌరవించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి కోరారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు.





## ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిన దేశ విభజన

### ప్రధాని మోదీ

**హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే ఉదయం)**

దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది. ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిం ది. ఎన్నో కుటుంబాలు

..మిగతా 2లో

# తలరాతలను మార్చే మార్గం విద్య ఒక్కటే



- కుల మతాలకు అతీతంగా అందరికీ ఒకే చోట విద్య
- కులవృత్తుల పేరుతో బీసీ ఎస్సీ ఎస్టీలను విద్యకు దూరం చేసిన కేసీఆర్
- సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని వ్యాఖ్యలు..
- పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్

**హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే ఉదయం)**

చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువు కోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇపడు అద్భుతంగా మారిందని చెప్పారు. ఇంతకాలం తర్వాత కూడా పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా పూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేకఫ్టస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తు న్నామని చెప్పారు.ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్

..మిగతా 2లో




## తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

### పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు

**హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే ఉదయం)**

తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి. ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.


# దేశ చరిత్రలో తొలిసారిగా జనగణనలో కులగణన

## రెండో దశలో 40 ప్రశ్నలు ఖరారు

**హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే ఉదయం)**

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జనగణన 2027' ప్రక్రియలో అత్యంత కీలకమైన అడుగు పడింది. జనాభా సేకరణ (పాపులేషన్ ఎన్యుమరేషన్) రెండో దశలో భాగంగా ప్రజలను అడగబోయే 40 ప్రశ్నల పూర్తి జాబితాను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించింది. ఈసారి జనాభా లెక్కల్లో భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా సమగ్ర కుల గణన చేపడుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఈ మేరకు ఆదేశాలు

..మిగతా 2లో



# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు

- డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్
- ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

2



## జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ







**ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ.**

**ఎంఏఎల్ డి కాలేజ్ నుంచి పాత బస్టాండ్, కృష్ణవేణి చౌక్, రాజీవ్ మార్గ్, పాత బస్టాండ్ వరకు సాగిన తిరంగా ర్యాలీ.**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు14(నమస్తే ఉదయం)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని శుక్రవారం గద్వాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణం ఎంఏఎల్ డి కళాశాల నుంచి పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, కృష్ణవేణి, రాజీవ్ మార్గ్ మీదుగా పాతబస్టాండ్ వరకు వివిధ పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ చేపట్టారు. భారీ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ విద్యార్థులు 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాలమూరు ఎంపీ డీకే అరుణ భారత దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. భారత జాతీయ పతాకానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు. హర్ ఘర్ తిరంగా పిలుపుతో దేశ వ్యాప్తంగా ప్రజలు జాతీయ జెండా ఇంటింటి పై ఎగురవేశారన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన తిరంగా ర్యాలీ విజయవంతం చేసిన విద్యార్థులు, యువకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వికాసిత్ భారత్ లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నారని, 2047 నాటికి వికాసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలి అని ఆకాంక్షించారు.శత్రు దేశాలను మట్టి కరిపించాలంటే.. అందరం ఐక్యంగా ఉండాలి అని, శత్రు దేశాల కుట్రలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత,ఐక్యత కోసం యువత కలసి ముందుకు నడవాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా హర్ ఘర్ తిరంగా కన్వీనర్ మిర్జాపురం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్ర రెడ్డి ,గద్వాల పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు బండల వెంకట రాములు,క్రిష్ణ వేణి ,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, కౌన్సిలర్లు మానస త్యాగరాజు,శాలన్న,చంద్ర శేఖర్,జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, మరియు డాక్టర్లు, లాయర్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు హాజరయ్యారు.

# కేటీదొడ్డి, గట్టు మండలలోని రైతుల చిరకాల కల సాకారం





**గట్టు ఎత్తిపోతల సామర్థ్యం 3 టీఎంసీలకు పెంపు: క్యాబినెట్ నిర్ణయంపై హర్షం**

**రూ. 1,781 కోట్లతో ప్రాజెక్ట్ రీడిజైన్ ఆమోదం**

**గద్వాల నియోజకవర్గం సస్యశ్యామలం: గద్వాల ఎమ్మెల్యే బండ్ల**

**సీఎం రేవంత్ రెడ్డి , మంత్రిలకు కృతజ్ఞతలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు14 (నమస్తే ఉదయం)**

కేటీదొడ్డి, గట్టు మండలలోని రైతుల చిరకాల కల సాకారం.. నెరవేరిందని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారంహైదరాబాదులో క్యాబినెట్ సమావేశం నందు గద్వాల నియోజకవర్గ సంబంధించిన నల్ల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల పథకం నీటి నిల్వ సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచుతూ, ఇందుకు రూ. 1,781 కోట్ల నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం పట్ల గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు... ఈ సందర్బంగా నియోజకవర్గ రైతులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ...గట్టు ఎత్తిపోతల ప్రాజెక్ట్ సామర్థ్యం పెంపుతో గద్వాల నియోజకవర్గం లోని ప్రతి ఎకరానికీ సాగునీరు అంది ప్రాంతం సస్యశ్యామలం కానుందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న ప్రాంత రైతాంగానికి ఈ నిర్ణయం సరికొత్త భరోసానిచ్చిందని తెలిపారు. రైతుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , ఉమ్మడి జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు గద్వాల ఎమ్మెల్యే రైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హన్మంతు మాట్లాడుతూ .. "గద్వాల ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను గుర్తించి, ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. సామర్థ్యాన్ని పెంచి నిధులు మంజూరు చేయడం మా ప్రాంత రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుంది" అని పేర్కొన్నారు."గతంలో కేవలం 1.3 టీఎంసీలుగా ఉన్న ప్రాజెక్టు సామర్థ్యాన్ని ఏకంగా 3 టీఎంసీలకు పెంచడం మా ప్రాంత రైతాంగానికి ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. మా విజ్ఞప్తిని మన్నించి ఇంతటి భారీ నిధులు కేటాయించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో కేటీదొడ్డి, గట్టు మండలాల రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతాయి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, గట్టు మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుంద, కేటిదొడ్డి మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సింగల్ విండో డైరెక్టర్ రఘుకుమార్ శెట్టి, కేటిదొడ్డి మండల యూత్ ప్రెసిడెంట్ మల్లేష్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తలరాతలను మార్చే మార్గం విద్య ఒక్కటే

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్ ఇస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే కేవలం మార్కులు, డిగ్రీలు సరిపోవని, నైపుణ్యాలూ అవసరమని అన్నారు. గ్రూప్-1 నియామకాల్లో బీసీలకు పెద్ద సంఖ్యలో అవకాశాలు లభించాయని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. సిరాజ్, నిఖజ్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఎంత బాధ్యతగా ఆలోచిస్తారో, తానూ అంతే బాధ్యతగా ఆలోచిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు. క్రీడల్లో రాణించి పతకాలు తీసుకొస్తే నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే కులగణన పూర్తి చేశామని తెలిపారు. కులగణనలో కొందరు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు పాల్గొనకుండా వ్యతిరేకించారని ఆరోపించారు. బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెపలు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా అని ప్రశ్నించారు. 'చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం' అని సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలపడానికి విద్యే మార్గమని పేర్కొన్నారు.

జ్యోతిబా ఫూలే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని, డాక్టర్లు,



ఇంజినీర్లు కావాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత తనదేనన్నారు. 'మీ బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అందుకే ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా ఫులే విధానాలను కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలు ఒకే చోట చదువు, జీవించడం ద్వారా కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం. ఈ ఏడాది నుంచే దీన్ని అమల్లోకి తెచ్చాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ అవుతుందన్నారు.



# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు

**హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే ఉదయం)**

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో ఇప్పటివరకు స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీ స్ట్రక్చర్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్దిదారులుండగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు.

ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకు రావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్సలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్సలకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని విద్యుత్తు వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందనుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్‌స్టలెంట్ నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# గణేష్ నవరాత్రులు, నిమజ్జనోత్సవాలు శాంతి యుతంగా నిర్వహించుకోవాలి

### రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి


పాత నగర బీజేపీ నాయకులు, అధికారులతో సమావేశమైన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి


అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్ , ఆగస్టు 14 (నమస్తే ఉదయం) : :**

పాతనగరంలోని చాంద్రాయణ గుట్ట, బహదూర్ పుర నియోజకవర్గాలలో సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బుద్వేల్ లో గల రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 14 నుంచి 11 రోజుల పాటు నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు. ఉత్సవాల సందర్భంగా కావలసిన అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం లాంటి పనులు సక్రమంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫలకనుమ ఫ్లై ఓవర్ కు ఇరువైపుల ఏర్పాటు చేసిన ఆర్చ్ లను తొలగించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరడం జరిగిందని, వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు, ప్రతీ వీధిలో వీధి దీపాలు వెలిగేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ నరేందర్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ లు పాపయ్య, సరిత, సురేందర్ లతో పాటు పాత నగర బీజేపీ నాయకులు కౌడి మహేందర్, జె నవీన్ యాదవ్, నంద కిషోర్, ప్రభాకర్ రావు, ప్రవీణ్ యాదవ్, శ్రీనివాస్, పొన్న శ్రీనివాస్, అడికె సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ఘనంగా గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతి వేడుకలు





**జయంతి వేడుకల్లో 250 మందికి పైగా యువకుల రక్తదానం.. ఉచిత వైద్య శిబిరం, అన్నదానం, రోగులకు పండ్ల పంపిణీ**

**భారీ సంఖ్యలో పాల్గొన్న జిఎంఆర్, జివిఆర్ యువసేన సభ్యులు**

**గూడెం విష్ణువర్ధన్ రెడ్డి సేవలను స్మరించుకున్న నాయకులు**

**పటాన్ చెరు, ఆగస్టు 14 (నమస్తే ఉదయం)**

పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు స్వర్గీయ గూడెం విష్ణువర్ధన్ రెడ్డి 37వ జయంతి వేడుకలను జిఎంఆర్, జివిఆర్ అభిమానులు, స్నేహితులు ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ విష్ణువర్ధన్ రెడ్డి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. జయంతి సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జిఎంఆర్ యువసేన, జివిఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి పైగా యువకులు రక్తదానం చేసి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్ పర్యవేక్షించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నిరుపేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. బ్లాక్ ఆఫీస్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. అనంతరం అభిమానులు, సన్నిహితులు, యువసేన సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. గూడెం విష్ణువర్ధన్ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా ఎదుగుతున్న క్రమంలో అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. ప్రజా సేవ పట్ల ఆయనకున్న ఆసక్తి, స్నేహశీలత, సేవా భావం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, పృథ్వీరాజ్, గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా రోగులకు
# మార్గదర్శక జన్యు చికిత్స

### అందుబాటులోకి తీసుకురావడానికి చర్చలు జరుపుతున్న తలసేమియా , సికిల్ సెల్ సొసైటీ

**బుద్వేల్ , ఆగస్టు 14 (నమస్తే ఉదయం) :**

థాయ్‌లాండ్‌లోని ప్రముఖ చికిత్సా కేంద్రాలలో జరిపిన అన్వేషణాత్మక పర్యటన అనంతరం, భారతదేశవ్యాప్తంగా తలసేమియా రోగులకు జన్యు చికిత్సను అందుబాటులోకి తీసుకురావడానికి తాము చేస్తున్న ప్రయత్నాలను తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ శుక్రవారం ప్రకటించింది. ఈ చొరవలో భాగంగా, చికిత్సా విధానాలు, మౌలిక సదుపాయాలు, సహకార అవకాశాలను పరిశీలన చేయడానికి.. తలసేమియా సంరక్షణలో జన్యు చికిత్సకు అంతర్జాతీయ గుర్తింపు పొందిన థాయ్‌లాండ్ మరియు ఇతర దేశాల్లో ఆ సంస్థ ప్రతినిధి బృందం పర్యటించింది. భారతదేశంలోని అత్యంత నిష్ణాతులైన బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులలో ఒకరైన డాక్టర్ సునీల్ భట్, అతని బృందం భాగస్వామ్యంతో ఈ పర్యటన చేపట్టబడింది. ఈ ప్రతినిధి బృందంలో టీఎస్‌సీఎస్ అధ్యక్షులు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, ముఖ్య వైద్య పరిశోధన అధికారి , కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, ఉపాధ్యక్షులు నరేష్ రాఠీ, శాస్త్రవేత్త డాక్టర్ నిశాంత్ మిట్టల్ ఉన్నారు. డాక్టర్ సునీల్ భట్ బృందంతో కలిసి, ఈ బృందం థలసేమియాకు అభివృద్ధి చెందుతున్న, విప్లవాత్మక చికిత్సా విధానమైన జన్యు చికిత్సను దేశవ్యాప్తంగా రోగులకు ఎలా అందుబాటులోకి తీసుకురావాలనే దానిపై చర్చలు జరిపింది. ఈ


డాక్టర్ సునీల్ భట్ తో తలసేమియా సికిల్ సెల్ వైద్య నిపుణులు

సందర్భంగా టీఎస్‌సీఎస్ అధ్యక్షులు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ మాట్లాడుతూ.. “భారతదేశవ్యాప్తంగా థలసేమియా రోగులకు అత్యంత అధునాతన చికిత్సా విధానాలను అందించాలనే తమ లక్ష్యంలో ఈ పర్యటన ఒక ముఖ్యమైన ముందడుగు” అని అన్నారు. రోగులు జీవితాంతం రక్త మార్పిడులపై ఆధారపడటాన్ని టీ సీ తగ్గించడానికి, దీర్ఘకాలిక ఫలితాలను మెరుగుపరచడానికి, భారతదేశంలో జన్యు చికిత్స అందుబాటుకు పునాది వేయడానికి వైద్య నిపుణులు, అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి పనిచేయడం ద్వారా ఈ పరిశోధనాత్మక పర్యటనను మరింత ముందుకు తీసుకెళ్లాలని టీఎస్‌సీఎస్ యోచిస్తోంది.


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు, చీరలు

## దొంగిలించిన చీరతో
# ఫంక్షన్‌కు వచ్చిన మహిళ

### దొంగను గుర్తించిన బాధితులు

### పోలీసులకు ఫిర్యాదు

**బుద్వేల్ ,ఆగస్టు 14 (నమస్తే ఉదయం) :**



ఫంక్షన్లో కట్టుకున్న పట్టు చీర ను గుర్తుపట్టిన ఆ ఇల్లాలు విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు తెలపడంతో మూడు సంవత్సరాలకు జరిగిన దొంగతనం బయటకు వచ్చింది. బండ్లగూడ జాగీర్ వినాయక్ నగర్ ప్రాంతానికి చెందిన ఎం. యాదయ్య తన భార్య పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. 2023 సెప్టెంబర్ 16వ తేదీన అనారోగ్యంతో నగరంలోని ఆసుపత్రిలో జాయిన్ అయ్యాడు. ఆ సమయంలో ఇంట్లో అల్మారాలో రూ . 2,50,000 నగదుతో పాటు తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను దాచారు. ఆసుపత్రికి వెళ్లే సమయంలో హడావిడిగా ఆధార్ కార్డుతో పాటు హెల్త్ కార్డును తీసుకొని బంగారు ఆభరణాలు నగదును అలాగే అల్మారాలో భద్రపరిచి వెళ్లిపోయారు. రెండు రోజుల అనంతరం 19వ తేదీన డిశ్చార్జి అయ్యి ఆసుపత్రి నుండి ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి అల్మారాలో ఆధార్ కార్డుతో పాటు హెల్త్ కార్డును భద్రపరిచే సమయంలో నగదు బంగారు ఆభరణాలు లేకపోవడంతో అదే రోజు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో ఎలాంటి క్లూ లేకపోవడంతో పోలీసులు కేసును మూసివేశారు. ఇదిలా ఉండగా గత ఐదు రోజుల క్రితం ఇంటి వెనకాలే ఉండే స్వప్న (29 )అనే గృహిణి యాదయ్య ఇంట్లో నుండి దొంగలించిన చీరలు కట్టుకొని ఫంక్షన్ కు వెళ్ళింది. ఈ ఫంక్షన్ కి వెళ్లిన యాదయ్య తో పాటు అతని భార్య చీరను గమనించి ఇది తన చీరేనని గుర్తుపట్టి విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు స్వప్నతో పాటు అతని భర్త రాములు (35)ను స్టేషన్ కు రప్పించి విచారించారు. మొదట తన చీరేనని గతంలో కొనుగోలు చేశానని బుకాయించింది. పోలీసులు తమదైన శైలిలో భార్యాభర్తలిద్దరిని వేరువేరుగా విచారించగా యాదయ్య ఇంట్లో దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. రెండు చీరలతో పాటు 9 తులాల ఆభరణాలను పోలీసులకు అప్పగించారు. ఇద్దరిపై దొంగతనం కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్కు తరలించారు.

# అత్తాపూర్ డైమండ్ సిటీ 6వఅంతస్తు పైనుంచి పడి యువకుడు మృతి

**బుద్వేల్, ఆగస్టు 14 (నమస్తే ఉదయం) :**


అత్తాపూర్ డైమండ్ సిటీ లోని ఓ భవనం పై నుంచి పడి మృతి చెందిన యువకుడు

టెర్రస్ పై పనిచేస్తున్న ఓ యువకుడు అదుపుతప్పి కింద పడి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్స్ పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం స్టేషన్ పరిధిలోని డైమండ్ సిటీ లోని జిఎం రెసిడెన్సి లో అలీ తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఇతని ఇంట్లో పని చేసేందుకు శుక్రవారం ఉదయం అక్రమ్( 22) సంవత్సరాల యువకుడు వచ్చాడు. టెర్రస్ పై పని చేస్తూ అదుపుతప్పి మూడవ అంతస్తు నుండి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా ఈ సంఘటనపై తమకు రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్స్పెక్టర్ సీతయ్య తెలిపారు.


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జలమండలి ఎండి అశోక్ రెడ్డి

# జలమండలి ప్రధాన కార్యాలయంలో ఘనంగా బోనాల వేడుకలు

**ఖైరతాబాద్, ఆగస్టు 14(నమస్తే ఉదయం)**

జలమండలి ప్రధాన కార్యాలయం ఖైరతాబాద్‌లో శుక్రవారం బోనాల సందడి నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన బోనాల వేడుకల్లో జలమండలి ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్ల మధ్య పోతురాజు నృత్యాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోతురాజు విన్యాసాలతో కార్యాలయ ప్రాంగణం బోనాల సందడితో మార్మోగింది. ఈ సందర్భంగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. జలమండలి ఉద్యోగులు, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, హైదరాబాద్ మహానగర ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, ఆచార సంప్రదాయాలను పరిరక్షిస్తూ నిర్వహించే ఇలాంటి వేడుకలు ఉద్యోగుల్లో ఐక్యత, ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్లు సుదర్శన్, ప్రభు, కేదారేశ్వరిలతో పాటు ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరి సాగుపై పూర్తిగా ఆధారపడొద్దు

**ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి రైతులు పంటల ఎంపిక చేసుకోవాలి**

**సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం**

**రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలి -- అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఆగస్టు14(నమస్తే ఉదయం)**



వాతావరణ పరిస్థితులు, రానున్న రోజుల్లో వర్షపాతం అంచనాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిగణనలోకి తీసుకుని రైతులు ప్రస్తుత సాగు సీజన్‌లో ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. ఈ నెల 15వ తేదీ తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో అధిక నీటి అవసరం ఉండే వరి పంటపై పూర్తిగా ఆధారపడకుండా, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా వర్షపాతం ఆధారంగా సాగు చేసే ప్రాంతాల్లో భవిష్యత్‌లో నీటి లభ్యత ఎలా ఉంటుందనే అంశాన్ని ముందుగానే అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. జలాశయాలు, చెరువులు, కాలువలు, బోర్లు తదితర నీటి వనరుల లభ్యతను పరిశీలించిన అనంతరం మాత్రమే అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయాలని తెలిపారు.

**ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత**

వరి పంటకు ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, మొక్కజొన్న, నువ్వులు తదితర తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను స్థానిక నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటలను కూడా వ్యవసాయ శాఖ సాంకేతిక సూచనల మేరకు సాగు చేయాలని తెలిపారు. ఒకే పంటపై పూర్తిగా ఆధారపడటం వల్ల వాతావరణ పరిస్థితుల్లో అనూహ్య మార్పులు వచ్చినప్పుడు రైతులు నష్టపోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా వాతావరణ ప్రతికూలతల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

**రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి**

ప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం అంచనాలు, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించడంతో పాటు, ఆయా ప్రాంతాలకు అనువైన పంటలను సూచించాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రైతుల సందేహాలను నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు. విత్తనాల ఎంపిక, విత్తే సమయం, సాగు విధానం, నీటి వినియోగం, ఎరువుల వినియోగం తదితర అంశాలపై శాస్త్రీయ సూచనలు అందించాలని ఆదేశించారు.

**సెప్టెంబర్‌లోనూ అప్రమత్తంగా ఉండాలి**

సెప్టెంబర్ నెలలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ఇప్పటి నుంచే పంటల ఎంపికపై తగిన నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, ఐఏఎస్ సూచించారు. భవిష్యత్ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం ఉండే పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు మధ్యలో నీటి కొరత ఏర్పడే పరిస్థితిని నివారించవచ్చని తెలిపారు. వర్షపాతం సాధారణ స్థాయిలో లేకపోతే పంటలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులు వాతావరణ హెచ్చరికలను నిరంతరం గమనించాలని కలెక్టర్ కోరారు. వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ జారీ చేసే సూచనలను పాటిస్తూ సాగు నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.

**ముందస్తు ప్రణాళికతో పంట నష్టాలను తగ్గించుకోవచ్చు**

అనిశ్చిత వర్షపాతం పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేయడం ద్వారా పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంపిక చేసుకోవడం, పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి చర్యలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. రైతులు ఎటువంటి నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి పంట నష్టాలను తగ్గించుకోవడంతో పాటు, రైతుల ఆదాయాన్ని స్థిరంగా కొనసాగించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు, సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# మండల ప్రజావాణిని సమర్థవంతంగా నిర్వహించాలి

**ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి మండల స్థాయిలో ప్రజావాణి**

**ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు14(నమస్తే ఉదయం)**



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మండల ప్రజావాణి వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు మండల ప్రజావాణి నిర్వహణకు సంబంధించి జిల్లాలోని మండల స్థాయి ఆపరేటర్లు, ప్రజావాణి సూపరింటెండెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను అక్కడికక్కడే వేగవంతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి వ్యవస్థను మండల స్థాయికి విస్తరించిందన్నారు. ఇప్పటికే ప్రతి సోమవారం జిల్లా, డివిజన్ స్థాయిలలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాజాగా మండల స్థాయిలో కూడా ప్రజావాణి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి అన్ని మండల కేంద్రాలలోని ఎంపీడీవో కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లాలని సూచించారు. మండల కేంద్రాల్లోనే వినతులు స్వీకరించి వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఇందువల్ల ప్రజలకు ప్రయాణ భారంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతాయన్నారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత విధానాల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల నమోదు సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, మండల స్థాయి ఆపరేటర్లు, ప్రజావాణి సూపరింటెండెంట్లు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే స్వీకరించి అట్టి ఫిర్యాదులను సంబంధిత శాఖలకు వెంటనే పంపాలని సూచించారు. ప్రజావాణి నిర్వహణలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో అప్‌డేట్ చేయాలని తెలిపారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందేలా మండల స్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ శిక్షణలో డీఆర్డీఓ, ఈ- జిల్లా మేనేజర్లు సంబంధిత సిబ్బందికి ప్రజా వాణి నిర్వహణ, ఫిర్యాదుల నమోదు, పరిష్కార ప్రక్రియ తదితర అంశాలపై మండల స్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ముషాయిదా బేగం, ఈడియం శివ, సూపరిడెంట్లు,ఆపరేటర్లు పాల్గొన్నారు.

# రైతన్నలపై 'ఎరువుల' భారం:

## అదనపు బాదుడుతో ఫర్టిలైజర్ వ్యాపారుల దౌర్జన్యం!

**డిఎపి కావాలంటే అదనపు మందులు కొనాల్సిందేనని హుకుం**

**బ్లాక్ మార్కెట్‌ను పట్టించుకోని వ్యవసాయ అధికారులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు14 (నమస్తే ఉదయం)**




జిల్లావ్యాప్తంగా ఎరువుల అక్రమ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ధరూర్ మండల కేంద్రంతో పాటు కేటీదొడ్డి, గట్టు, మల్దకల్, గద్వాల ప్రాంతాల్లో పంటలకు అవసరమైన ఎరువుల కోసం ఫర్టిలైజర్ షాపులకు వెళ్తున్న రైతుల జేబులకు వ్యాపారులు భారీగా కత్తెర వేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరల కంటే అత్యంత అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తూ అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు.

**కొంటే కొను... లేదంటే వెళ్లు' అంటూ దౌర్జన్యం**

మార్కెట్లో డిఏపి బస్తా నిర్ణీత ధర ₹1,350 ఉంటే, ఫర్టిలైజర్ దుకాణదారులు ₹1,700 నుండి ₹1,800 వరకు అమ్ముతూ బస్తాకు దాదాపు ₹400 వరకు అదనపు భారాన్ని రైతులపై మోపుతున్నారు. ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని నిలదీస్తే, "మా ఇష్టం... ఉంటే కొనుక్కో, లేదంటే వెళ్లిపో" అంటూ వ్యాపారులు దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి దిగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు, డిఏపి బస్తా కావాలంటే తమ వద్ద ఉన్న ఇతర పురుగు మందులు లేదా ఇతర ఎరువుల బస్తాలను కచ్చితంగా కొనాలని 'లింక్ సేల్స్' పేరిట హుకుం జారీ చేస్తుండటంతో సాగు ఖర్చులు భరించలేక రైతులు బోరుమంటున్నారు.

**అధికారుల ఉదాసీనతపై ఆగ్రహం:**

ఇంత బహిరంగంగా బ్లాక్ దందా జరుగుతున్నా, మండల , జిల్లా వ్యవసాయ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతన్నలు ఆరోపిస్తున్నారు. అధికారులకు ప్రత్యక్షంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే, జిల్లా యంత్రాంగం ఫర్టిలైజర్ వ్యాపారుల గుప్పెట్లో ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మరియు వ్యవసాయ శాఖ స్పందించి, తక్షణమే ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని, అదనపు ధరలకు ఎరువులు విక్రయిస్తూ రైతులను వేధిస్తున్న వ్యాపారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.



# అధికారులంటే అలుసా?

## కలెక్టర్ ఆదేశాలకే దిక్కులేదా?!

**గట్టులో బేఖాతరు అవుతున్న కలెక్టర్ ఉత్తర్వులు**

**35 డబ్బాల్లో తీసింది 4,5 మాత్రమే... మిగతావి ఎవరి భరోసాతో?**

**కరెంట్ కట్ చేసినా కదలని ఆక్రమణదారులు!**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు14(నమస్తే ఉదయం)**

గట్టు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన తాత్కాలిక డబ్బాల వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మీసేవ, సిఎస్సి (జూజ), ఆన్‌లైన్ సెంటర్ల పేరిట రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన ఈ డబ్బాలను తక్షణమే తొలగించాలని స్వయంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించినా, స్థానికంగా అమలు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. తహసీల్దార్ కార్యాలయం పరిసరాల్లో మొత్తం 35 డబ్బాలు ఉండగా, డబ్బాల ను తొలగించాలని గట్టు తహసీల్దార్ నోటీసులు ఇవ్వడంతో వాటిలో కేవలం 4,5 డబ్బాలను మాత్రమే అక్కడ నుంచి తీసేశారు. మిగతా డబ్బాలు ఇప్పటికీ అలాగే రోడ్డుపై దర్శనమిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు ఆ డబ్బాలకు విద్యుత్ కనెక్షన్లు తొలగించినప్పటికీ, డబ్బాల యజమానులు మాత్రం వాటిని అక్కడి నుండి తీసేయకుండా కలెక్టర్ ఆదేశాలనే బేఖాతరు చేస్తున్నారు. జిల్లా అత్యున్నతాధికారి ఇచ్చిన ఆదేశాలనే బేఖాతరు చేస్తుంటే, గట్టు అధికారులు ఏం చేస్తున్నారని స్థానిక ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కఠినంగా వ్యవహరించి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న మిగతా డబ్బాలను కూడా తక్షణమే తొలగించాలని గట్టు మండల ప్రజలు కోరుతున్నారు.



# గట్టులో అక్రమ నిర్మాణాలపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వార్డు సభ్యులు, ఉపసర్పంచ్

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు14(నమస్తే ఉదయం)**

గట్టు గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలకుంట రోడ్డులో ఉన్న విలువైన గ్రామకంఠం (ప్రభుత్వ) స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కె. అంజనేయులు మరియు వార్డు సభ్యులు మాట్లాడుతూ... గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సుమారు 70 ´ 80 ఫీట్ల గ్రామకంఠ స్థలాన్ని ఆక్రమించుకున్నారని తెలిపారు. ఎలాంటి చట్టబద్ధమైన హక్కు పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకపోయినా, గతంలో సృష్టించిన నకిలీ కాగితాలను చూపుతూ అక్రమంగా షాపులు నిర్మించారని ఆరోపించారు. గ్రామంలో ఇతరులు ఎవరైనా ఇండ్లు నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తే వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ, అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, అధికారులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆ స్థలానికి సంబంధించిన హక్కుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామకంఠం స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఖ. అంజనేయులు, వార్డు సభ్యులు ం. రేవతి వెంకటేష్ , రోల్లి రేనమ్మా ,కంగారు తిమ్మప్ప రంగస్వామి, జక్కలి మునిస్వామి సోంపురం తిమ్మప్ప సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో నిత్యాన్నదానం

**26 అంశాలకు పాలకమండలి ఆమోదం**

**యాదగిరిగుట్ట,ఆగస్ట్14 (నమస్తే ఉదయం)**



ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా పాలక మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మొత్తం 26 అంశాలకు ఆమోదం తెలిపింది. కొండపై దీక్షాపరుల, నిత్యకల్యాణ మండపాల ఏర్పాటు, మెట్ల మార్గంలో షెడ్లు, వేద పాఠశాల, గోశాల, రాయగిరి వద్ద భారీ కమాన్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. రోజూ 2వేల మంది భక్తులకు అన్నదానం అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఆర్జిత సేవలు, నిత్య కైంకర్యాలకు టీసీఎస్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సౌకర్యం కల్పించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. భక్తుల కోసం ప్రత్యేక సబ్ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. కొండ చుట్టూ ప్రధాన కూడళ్ల వద్ద రాతి విగ్రహాల ఏర్పాటు, తులసి కాటేజీలో రెండు కల్యాణ కట్టల నిర్మాణానికి ట్రస్ట్ బోర్డు ఆమోదం ముద్ర వేసింది. దాతల కోసం కొండపై ప్రత్యేక కార్యాలయం, గిరిప్రదక్షిణ మార్గంలో సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.